అడవులదీవిలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ పర్యటన



నిజాంపట్నం: బాపట్ల జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కట్ట శ్రీనివాసరావు, గుదే రాజారావు, తుపాకుల సురేష్‌బాబు, నిజాంపట్నంలోని తహసీల్దారు నెహ్రూబాబును కలిసి, ఎస్టీ ఎరుకుల కులానికి సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రాల మంజూరులో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా తహసీల్దారు నెహ్రూబాబు మాట్లాడుతూ మండలంలోని అడవులదీవి పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో ఎరుకుల కులానికి చెందిన 25 కుటుంబాలపై దేవరకొండ నాగేంద్రం అనే వ్యక్తి 2014లో అర్జీ దాఖలు చేయడం జరిగిందన్నారు. అప్పటి జిల్లా కలెక్టర్ క్రాంతిలాల్ దండే విచారణ జరిపించి వారిని బీసీ–ఈగా గెజిట్ విడుదల చేయడం జరిగిందన్నారు. అనంతరం కమిటీ సభ్యులు ఎస్టీ కాలనీకి వెళ్లి బాధిత కుటుంబాలతో మాట్లాడారని వెల్లడించారు. కాలనీకి చెందిన కుటుంబాలు కమిటీ సభ్యుల ముందు మాట్లాడుతూ ఈ గెజిట్ గురించి తమకు తెలియదని, దేవరకొండ నాగేంద్రం అనే వ్యక్తి తమపై కక్షపూరితంగా పిటిషన్ వేసి, ఇబ్బందులకు గురిచేస్తూ ప్రభుత్వ పథకాలు, విద్య, ఉద్యోగ రిజర్వేషన్‌కు సంబంధిత అంశాలు పొందకుండా అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. తమ పూర్వికుల నుంచి ఎస్టీ ఎరుకులకు చెందిన వారమని తాము తమ కులవృత్తిని నేటికి అవలంభిస్తున్నామని తెలిపారు. తమపై కక్షపూరితంగా అమలు చేయించిన గెజిట్‌ను తొలగించి, ఎస్టీ ఎరుకుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు.

అభివృద్ధికి పట్టం కట్టండి



పల్లెకోనలో కరపత్రం అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

- మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- పల్లెకోనలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

పల్లెకోన(భట్టిప్రోలు): గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. పల్లెకోనలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. మంత్రి నాగార్జునకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. గడప గడపకు వెళ్లి ఆయా కుటుంబాలకు అందిన వివిధ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. దీనికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఎన్నికల హామీలన్నీ అమలు చేయడంతో పాటు అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నారన్నారు. ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు నిండుకున్నాయని తెలిపారు. కుల, మత, ప్రాంత, పార్టీ విబేధాలు లేకుండా అన్ని వర్గాలకు పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పల్లెకోన, ఆళ్లమూడి, రాచూరు గ్రామ సర్పంచులు బొల్లెద్దు రాజమ్మ ప్రతాప్‌కుమార్, పెద్దిశెట్టి రాంబాబు, జయవరపు రాధాకృష్ణమూర్తి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), ఎంపీటీసీ సభ్యులు దున్నా తిరపతిబాబు, మండల జేసీఎస్ కన్వీనర్, సూరేపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ గోవర్ధనగిరి చినబుజ్జి, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, తహసీల్దారు డి.వెంకటేశ్వరావు, ఈవో పీఆర్డీ టి.ఊహారాణి, ఇన్‌చార్జ్ సెక్రటరీ పి.రామ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌కు రూ.3.50 లక్షల విరాళం



బ్లడ్ బ్యాంక్‌కు నగదు అందజేస్తున్న డాక్టర్ రమాదేవి

రేపల్లె: బ్లడ్ బ్యాంక్ పురోభివృద్ధికి దాతలు సహకారం అందించాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వసంతం వీర రాఘవయ్య కోరారు. ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ రేపల్లె బ్రాంచ్‌కు అవసరమైన యంత్ర సామగ్రి కొనుగోలుకు యూఎస్ఏకు చెందిన వైద్యులు దేవభక్తుని రమాదేవి తన భర్త దేవభక్తుని బాబాఈశ్వర దత్తు జ్ఞాపకార్థం బుధవారం రూ.3.50లక్షల విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో అత్యంత నాణ్యతా ప్రమాణాలతో నడుస్తున్న రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ బ్యాంక్ రిఫ్రిజిరేటర్, లాబినర్ ఎయిర్ ఫ్లో, వాటర్ బాత్ లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దాతలు విరాళాన్ని అందించేందుకు సహకరించిన నగరం ఎస్‌వీఆర్ఎం కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ సభ్యులు ఎ.ప్రభాకరరావు పాల్గొన్నారు.

నేడు శాంతియుత ర్యాలీ

భట్టిప్రోలు: మణిపూర్ రాష్ట్ర క్రైస్తవుల న్యాయం కోసం జీసస్ గ్రేస్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గురువారం భట్టిప్రోలులో శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నట్లు బిషప్స్, రెవరెండ్స్, పాస్టర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు భట్టిప్రోలులోని ఆర్‌సీఎం చర్చి నుంచి ర్యాలీ కొనసాగుతుందని పేర్కొన్నారు. తహసీల్దారు, పోలీస్ స్టేషన్‌లలో వినతి పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.

సర్వసభ్య సమావేశం రేపు

పిట్టలవానిపాలెం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యదర్శుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ షేక్ బాజీ అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులకు సమాచారం అందించామని తెలిపారు. తప్పనిసరిగా హాజరుకావాలని, గైర్హాజరైన అధికారులపై చర్యలు ఉంటాయని తెలిపారు. ఇవోపీఆర్డీ పద్మజ ఉన్నారు.

రేపు అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

భట్టిప్రోలు: భట్టిప్రోలు బస్టాండ్ సెంటర్‌లోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ, భక్త బృందం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. స్వామివారికి విశేష పూజలు, ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

6న జిల్లా అర్చక సమాఖ్య సమావేశం

రేపల్లె: పట్టణంలోని ఇసుకపల్లి శివాలయంలో ఈ నెల 6న ఆదివారం బాపట్ల జిల్లా ప్రాంతీయ అర్చక సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు అర్చక సమాఖ్య ఉపాధ్యక్షుడు రొంపిచర్ల విజయసారథి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాఖ్య సభ్యులు, అర్చక సోదరులు పాల్గొనాలని పేర్కొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చెరుకుపల్లి: మండల పరిధిలోని ఆరుంబాక -1 (బీసీ) కనగాల-1 (బీసీ) కావూరు-1(ఓసీ), పొన్నపల్లి-(ఓసీ), తూర్పుపాలెం-1(ఓసీ), గ్రామ సచివాలయాల పరిధిలో లో ఖాళీగా ఉన్న ఐదు వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జాతిరత్నం పింగళి



బాపట్ల: భరతజాతికి అస్తిత్వాన్ని, ఆత్మస్థైర్యాన్ని అందించిన పింగళి వెంకయ్య తెలుగువాడు కావడం గర్వకారణమని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టరు పి.సి.సాయిబాబు పేర్కొన్నారు. పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి బుధవారం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింగళి రూపొందించిన త్రివర్ణ పతాకం ఉద్యమాలకు ఊపిరిగా, సమరయోధులకు ఆయుధంగా నిలిచిందని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎస్.మదన్ మోహన్ చెట్టి, ఏవీవీ హైస్కూల్ ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైస్తవుల ఆధ్వర్యంలో శాంతి ప్రదర్శన

బాపట్ల: మణిపూర్‌లో జరిగిన హింసా కాండకు నిరసనగా క్రైస్తవ పెద్దల ఆధ్వర్యంలో భారీ శాంతి ప్రదర్శన బాపట్లలో సాగింది. మణిపూర్‌లో జరిగిన ఘటనను ఖండిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. బాపట్ల టౌన్ హాల్ డినోమినేషన్స్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరిగింది. జి.మణిభూషణ్, కె.క్రిస్టఫర్, జి.జాన్ వెస్లీ పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



చుండూరు(వేమూరు): చుండూరు మండల కేంద్రంలో టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని తహసీల్దారు కనుకదుర్గ బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి నెల గర్భిణుల ఇంటి వద్దకు పది రకాల పౌష్టికాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జాలాది రూబేను, డాక్టర్ సింధూ, పంచాయతీ కార్యదర్శి శివరామకృష్ణ, చండూరు, మున్నంగివారి పాలెం, నడిగడ్డపాలెం నర్సులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో మేలు..



దోనేపూడిలో గర్భిణులకు కిట్లు అందజేస్తున్న అధికారులు



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్టు అందజేస్తున్న తహసీల్దారు కేశవ నారాయణరావు

కొల్లూరు : పౌష్టికాహార లోపాన్ని నివారించి తల్లీబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండాలన్న సంకల్పంతో ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో గర్భిణులు, బాలింతలకు ఎంతో మేలు జరుగుతుందని కొల్లూరు తహసీల్దారు ఎ. శ్రీనివాసరావు అన్నారు. బుధవారం దోనేపూడి అంగన్‌వాడీ–1 కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కిట్ల ద్వారా బలవర్ధకమైన పది రకాల వస్తువులను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. గతంలో ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పౌష్టికాహారం స్వీకరించాల్సి ఉండటంతో కొంతమంది గర్భిణులు, బాలింతలు రాలేక పౌష్టికాహారాన్ని తీసుకోకపోవడాన్ని దృష్టిలో ఉంచుకుని నెలకు సరిపడా ఆహార పదార్థాలను ప్రభుత్వం ఇంటికే పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం హర్షించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో సర్పంచి వాగోలు గౌతమి, ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు, దోనేపూడి సెక్టార్ సూపర్‌వైజర్ నగరాజకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు సౌభాగ్యలక్ష్మి, రాజ్యలక్ష్మి, సంధ్య, బసవపూర్ణ పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ పథకాన్ని వినియోగించుకోవాలి

కర్లపాలెం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని గర్భిణులు, బాలింతలు వినియోగించుకోవాలని డీపీవో డి.రాంబాబు కోరారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలలో రక్త హీనత నివారణకు సంపూర్ణ పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ప్రవేశపెట్టిందని తెలిపారు. తహసీల్దారు కేశవనారాయణరావు, సీడీపీవో శైలజ మాట్లాడుతూ సంపూర్ణ పోషణ పథకం కిట్లను గర్భిణులు, బాలింతల ఇళ్లకు వెళ్లి అందజేయాలని సిబ్బందికి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యారం వనజ, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

మత్స్య సంపద వెలికతీత.. నిబంధనలకు లోబడి ఉండాలి

కొల్లూరు : చేపల వేట ద్వారా జీవనభృతి పొందుతున్న మత్స్యకారులు మత్స్య సంపద వెలికితీత విషయంలో నిబంధనలకు లోబడి వ్యవహరించాలని నిజాంపట్నం మత్స్యశాఖ సహాయ సంచాలకులు భుక్యా సైతా అన్నారు. బుధవారం మండలంలోని గాజుల్లంకలో స్వదేశీ మత్స్యకారులకు మొదటి విడత వైఎస్సార్ మత్స్య సాగుబడి కార్యక్రమంలో భాగంగా అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్స్యకారులు తప్పనిసరిగా తమ లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోవాలని, మత్స్యకార సంఘాలపై అవగాహన కల్పించారు. ప్రతి సంఘం పది రకాల రికార్డులను తప్పనిసరిగా నిర్వహిస్తూ.. ప్రతి ఏడాది ఆడిట్ చేయించుకోవాలన్నారు. గాజుల్లంక – కృష్ణా జిల్లా నడుమ ప్రయాణికులను చేరవేసే విషయంలో కృష్ణా జిల్లా అధికారులు అడ్డుకుంటున్నారని ఆయనకు మత్స్యకారుల విన్నవించారు. మత్స్యశాఖ కమిషనర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లి సరైన భద్రత నడుమ ప్రయాణికులను నది దాటించేందుకు పడవలకు అనుమతులు ఇచ్చేలా కృషి చేస్తానని ఏడీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి మత్స్యశాఖ అభివృద్ధి అధికారిణి జె.మహిజ, ఫిషరీస్ అసిస్టెంట్‌లు పి.సూర్యనారాయణ, కె.రత్నమాధురి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగించుకోవాలి



కార్మికుల పేర్లు నమోదు చేస్తున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సాయిజ్యోతి

కర్లపాలెం: కార్మికులందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వి.సాయిజ్యోతి అన్నారు. కర్లపాలెం పెద్దింటమ్మ ఆలయంలో బుధవారం కార్మికుల పేర్లను ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులు, ఆశ కార్యకర్తలు వ్యవసాయ కూలీలు, చిరు వ్యాపారులు, మత్స్యకార కార్మికులు, ఉపాధి హామీ కూలీలు, వీధి వ్యాపారులు ఈ–శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఈ–శ్రమ్ కార్డు ద్వారా పొందేందుకు కార్మికులకు అవకాశం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు ఎస్కే కరిముల్లా, పిట్టు కాసులరెడ్డి ఉన్నారు.

పోస్టాఫీసు గేట్లు మూసి మహిళల ఆందోళన



ఆందోళన చేస్తున్న మహిళలు

కొల్లూరు : పోస్టాఫీసులో జమ చేసిన డిపాజిట్ సొమ్ము గోల్‌మాల్ వ్యవహారంపై డిపాజిటర్ల ఆందోళన కొనసాగుతూనే ఉంది. రూ.లక్షల్లో తమకు చెల్లించాల్సిన సొమ్ముపై పోస్టల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో గత నెలలో రెండు దఫాలుగా పోస్టాఫీసు వద్ద బాధిత డిపాజిటర్లు ఆందోళనకు దిగారు. అప్పట్లో ఎస్‌ఐ రాజ్యలక్ష్మి, పోస్టల్ అధికారులు జులై నెలాఖరుకు డిపాజిటర్లకు రావాల్సిన సొమ్ములు తిరిగి చెల్లించేలా ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అయితే ఇచ్చిన హామీ నెరవేరకపోవడంతో బుధవారం తిరిగి కొల్లూరు ఎస్‌ఐ రాజ్యలక్ష్మిని బాధితులు ఆశ్రయించారు. డిపాజిట్ సొమ్ము తిరిగి చెల్లించే విషయం పోస్టల్ అధికారులనే అడిగి తెలుసుకోవాలని ఆమె సూచించడతో పోస్టాఫీసు వద్దకు డిపాజిటర్లు చేరుకున్నారు. అక్కడ సరైన సమాధానం లభించకపోవడంతో ఆందోళనకు దిగారు. పోస్టుమాస్టర్ మోహన్‌తోపాటు, సిబ్బందిని బయటకు పంపి గేట్లు మూసి, ప్రధాన ద్వారం ఎదురుగా బైఠాయించి, నిరసన చేపట్టారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డిపాజిటర్లు ఆందోళన కొనసాగించడంతో సమాచారం తెలుసుకున్న తెనాలి బ్రాంచ్ పోస్టాఫీసు అధికారి పి.వెంకటస్వామి కొల్లూరు పోస్టాఫీసుకు చేరుకుని ఆందోళన చేస్తున్న డిపాజిటర్లతో చర్చించారు. క్రాప పోస్టాఫీసులో నగదు పొదుపు చేసుకున్న 102 మంది లబ్ధిదారులలో 57 మందికి ఈ నెల 15లోపు నగదు చెల్లింపులు చేస్తామని, మిగిలిన 45 మందికి ఈ నెలాఖరుకి చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. డిపాజిటర్లకు సీపీఎం నాయకులు బి.సుబ్బారావు, టి. సురేష్ మద్దతుగా నిలిచారు.

మణిపూర్ ఘటనకు బీజేపీ బాధ్యత వహించాలి



వేమూరు: మణిపూర్‌లో క్రైస్తవులపై చేసిన దాడులకు బీజేపీ బాధ్యత వహించాలని పాస్టర్ల సంఘం మండలాధ్యక్షుడు రెవరెండ్ సీహెచ్ సుధాకర్ అన్నారు. ఈ మేరకు వేమూరు రైల్వే గేటు వద్ద పాస్టర్లు నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన కూడళ్లలో ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో బీజేపీ, దాని అనుబంధ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ సంస్థ దళితలు, క్రైస్తవులు, ముస్లింలపై చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన పదవికి రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు రెవరెండ్ జోషి, రెవరెండ్ డేవిడ్ రాజ్, మోజేష్, రవి కుమార్, పాల్, పి.శ్యామ్, నల్లబోతు ప్రభుదాసు, ఎం.ఏసుదాసు, పి.రత్నన్ కిషన్, తలతోటి రవి కుమార్, దాసరి ఏసుపాదం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రేపల్లె వ్యక్తి మృతి


కోవూరు(విడవలూరు): ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొన్న ప్రమాదంలో రేపల్లెకు చెందిన మాటూరి యలమంద(31) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నెల్లూరు జిల్లా విడవలూరు మండలం దండిగుంట గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని ఓ ఫైనాన్స్ సంస్థలో యలమంద పనిచేస్తున్నాడు. ఈయనకు ఏడాది క్రితం మనీషాదేవితో వివాహమైంది. తన విధుల్లో భాగంగా బుధవారం ఓ ఫైనాన్స్ వసూలు నిమిత్తం బైక్‌పై వెళ్తుండగా విడవలూరు మండలం దండిగుంట గ్రామం వద్ద ఆర్టీసీ బస్సును వేగంగా ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన యలమందను 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
బాపట్ల
గురువారం । 3 । ఆగస్టు । 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: ఎగువ నుంచి నీరు వచ్చి చేరుతుండటంతో పులిచింతల ప్రాజెక్టు నిల్వ బుధవారం సాయంత్రానికి 34 టీఎంసీలకు చేరింది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 3,422 క్యూసెక్కులు విడుదల చేశారు.



హుండీ ఆదాయం రూ.15లక్షలు

దుర్గి : అడిగొప్పల శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి హుండీ కానుకలు లెక్కించగా రూ. 15,43,027ల ఆదాయం వచ్చినట్లు ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు.

న్యూస్‌రీల్

జేసీతో సమావేశమైన ట్రైనీ జూనియర్ న్యాయమూర్తులు



గుంటూరు : శిక్షణలో ఉన్న 11 మంది జూనియర్ సివిల్ న్యాయమూర్తులు బుధవారం జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారిని కలిశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో సమావేశమైన ట్రైనీ న్యాయమూర్తులు రెవెన్యూ, పౌరసరఫరాలు, స్పందన, జగనన్నకు చెబుదాం, రికార్డు రూమ్ నిర్వహణ, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల విధి నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. జేసీ పలు అంశాలపై వారితో చర్చించారు. మారుతున్న కాలంలో ప్రజల అవసరాల నిమిత్తం రెవెన్యూ శాఖలో వస్తున్న వేగవంతమైన మార్పులను వివరించారు. న్యాయమూర్తులు పలు సందేహాలను నివృత్తి చేశారు.

సజావుగా పింఛన్ల పంపిణీ




నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుకను గుంటూరు జిల్లాలో బుధవారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్ళి వలంటీర్లు అందజేశారు. రెండో రోజు జిల్లాలో 92.70 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,49,667 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.68.59 కోట్లు కేటాయించింది. బుధవారం సాయంత్రానికి 2,31,430 మందికి నగదు అందజేశారు.

ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా ముస్లిం, మైనార్టీ అభ్యర్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కల్పిస్తున్నట్లు గుంటూరు-1, 2 ఉర్దూ అకాడమీ కంప్యూటర్ శిక్షణ కేంద్రాల ఇన్‌చార్జ్‌లు షేక్ మహిమున్నీసా, షేక్ కరీముద్దీన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల మూడో వారంలో ప్రారంభం కానున్న డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ కోసం ఈనెల 17వ తేదీలోపు ఆసక్తి గల అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. టెన్త్‌లో ఉత్తీర్ణులై, ఉర్దూ భాషలో చదవడం, రాయడం వచ్చిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణ పొందిన అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. గుంటూరు-1 పరిధిలో పాలాసుపత్రి వద్ద ఉన్న చిన్నబజారులోని అమీనా కాంప్లెక్స్‌లోని ఉర్దూ అకాడమీ శిక్షణ కేంద్రంలో నేరుగానూ, 85550 88516 సెల్ నంబర్లో సంప్రదించాలని తెలిపారు. అదే విధంగా గుంటూరు-2లో కృష్ణనగర్ రెండో లైనులోని శిక్షణ కేంద్రంలో 94940 42963 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

యార్డులో 36,473 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 33,985 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 36,473 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10 వేల నుంచి రూ.24 వేల వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10 వేల నుంచి రూ.26 వేల వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,500 నుంచి రూ.24 వేల వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10 వేల నుంచి 25,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5 వేల నుంచి రూ.14 వేల వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,724 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఇళ్ల వద్దకే ‘సంపూర్ణ పోషణ’

భట్టిప్రోలులో లాంఛనంగా ప్రారంభించిన మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున



భట్టిప్రోలులో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న మంత్రి నాగార్జున

భట్టిప్రోలు: గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పడిగాపులు పడకుండా వారి ఇళ్లకే పౌష్టికాహారం తీసుకెళ్లి ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున తెలిపారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా టేక్ హోమ్ రేషన్ (టీహెచ్ఆర్) కిట్ల పంపిణీ కార్యక్రమం బుధవారం వేమూరు నియోజకవర్గ స్థాయిలో మండల కేంద్రమైన భట్టిప్రోలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మంత్రి నాగార్జున లాంఛనంగా ప్రారంభించారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పడిగాపులు పడాల్సిన అవసరం లేకుండా ఇకపై ఇంటి వద్దే సరుకులు తీసుకోవచ్చని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాణ్యమైన సరుకులు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నెలలు నిండిన గర్భిణులకు ఇళ్లకే తీసుకెళ్లి ఇచ్చేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి బి.విజయలక్ష్మి మాట్లాడుతూ 15 కిలోల బ్యాగ్‌లో 10 రకాల వస్తువులు కలిగిన కిట్లను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో బియ్యం, కందిపప్పు, అటుకులు, పామాయిల్, పాలు, బెల్లం, వేరుశనగ చిక్కి, ఎండు ఖర్జూరం, కోడిగుడ్లు ఉంటాయని తెలిపారు. సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఉప సర్పంచ్ బూర్లె రామప్రసాద్, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మేరుగ చందన్ నాగ్, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, తహసీల్దార్ డి.వెంకటేశ్వరావు, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరావు, వేమూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉప్పు శిరీష, మండల జేఏసీ కన్వీనర్, సూరేపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ గోవర్ధనగిరి చినబుజ్జి, వైస్ ఎంపీపీలు మురాల రాంబాబు, కనపర్తి మాణిక్యమ్మ, కో-ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, మాజీ ఎంపీపీ మాచర్ల హేమసుందరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అన్ని జిల్లాల్లో ఎన్‌సీసీ విస్తరణకు సన్నాహాలు

- ఎన్‌సీసీ అకాడమీ ఏర్పాటుకు స్థలం కేటాయించేందుకు ప్రభుత్వ హామీ
- ఆంధ్ర, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమొడోర్ మధుసూదనరెడ్డి



ఎన్‌సీసీ అధికారులతో మధుసూదనరెడ్డి

తెనాలి: ఎన్‌సీసీని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో విస్తరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమొడోర్ వి.మధుసూదనరెడ్డి చెప్పారు. స్థానిక ఐతానగర్‌లోని ఎన్‌సీసీ 22వ ఆంధ్రా బెటాలియన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. నెలరోజుల క్రితం బాధ్యతలు చేపట్టిన ఎయిర్ కమొడోర్ మధుసూదనరెడ్డి ఎన్‌సీసీ కేంద్రాల సందర్శనలో భాగంగా ఇక్కడికి వచ్చారు.

ఎన్‌సీసీ అధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. 2022–23 సంవత్సరంలో ఎన్‌సీసీ బెటాలియన్ కార్యక్రమాలపై ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్‌సీసీ కార్యకలాపాలు ఏవిధంగా జరుగుతున్నాయి...వాటిని మరింత మెరుగ్గా ఎలా చేయాలనే అంశంపై పరిశీలన చేస్తున్నట్టు ఈ సందర్భంగా చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాను ఇంతకుముందే కలిసినట్టు తెలిపారు. ఎన్‌సీసీ శిక్షణ అకాడమీ ఏర్పాటుకు అవసరమైన స్థలం సమకూర్చేందుకు ముఖ్యమంత్రి హామీనిచ్చినట్టు చెప్పారు. అకాడమీ ఏర్పాటుతో ఎన్‌సీసీ క్యాడెట్లకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో మరో 60 వేలమంది విద్యార్థులు ఎన్‌సీసీలో ఎన్‌రోల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఎన్‌సీసీ అధికారులు ఎ.ఉమాశంకర్, వి.మౌనిక, జి.హనుమంతరావు, సమ్యానాయక్, సర్దార్ పరిశా, కత్తి శ్రీనివాసరావు, కె.స్వామి, బాషా, గోపి, భిక్షాలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రచురణకు సహకరించండి



ఓటర్ల జాబితాపై రాజకీయపార్టీల నాయకులతో సమీక్షిస్తున్న జేసీ శ్రీధర్

బాపట్ల: జిల్లాలో ఓటర్ల జాబితా ప్రచురణకు సహకరించాలని జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జేసీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితా తయారు చేయడానికి బూత్ స్థాయిలో ఇంటింటి సర్వే జరుగుతోందన్నారు. దీనికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. ఓటర్ల జాబితాలో అనుమానం ఉంటే బూత్ లెవల్ అధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీశివజ్యోతి, రాజకీయ పార్టీల ప్రతినిధులు కె.కోటేశ్వరరావు, గంగయ్య, రామకష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రిటర్నింగ్ అధికారుల నియామకం

నగరంపాలెం: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులను నియమిస్తూ బుధవారం గెజిటెడ్ నోటిఫికేషన్ విడుదల చేశారు.

పెదకూరపాడు : డెప్యూటీ కలెక్టర్ జిల్లా విజిలెన్స్ సెల్-2 **తాడికొండ (ఎస్సీ):** స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కోనేరు రంగారావు కమిటీ **మంగళగిరి** : స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ **పొన్నూరు:** ప్రాజెక్టు డైరెక్టర్ డీఆర్‌డీఏ గుంటూరు **వేమూరు (ఎస్సీ):** చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జిల్లాపరిషత్ గుంటూరు. **రేపల్లె:** ఆర్డీఓ రేపల్లె **తెనాలి** : సబ్ కలెక్టర్ తెనాలి **బాపట్ల** : ఆర్డీఓ, బాపట్ల **ప్రత్తిపాడు (ఎస్సీ):** ఆర్డీఓ గుంటూరు, **గుంటూరు పశ్చిమ** : అదనపు కమిషనర్ జీఎంసీ **గుంటూరు తూర్పు:** కమిషనర్ జీఎంసీ **చిలకలూరిపేట:** స్పెషల్ కలెక్టర్ పులిచింతల **నరసరావుపేట:** ఆర్డీఓ నరసరావుపేట **సత్తెనపల్లి** : ఆర్డీఓ సత్తెనపల్లి **వినుకొండ** : స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ (పులిచింతల) **మాచర్ల** : స్పెషల్ కలెక్టర్ (పులిచింతల) **గురజాల** : ఆర్డీఓ, గురజాల

టీకా.. పక్కాగా!

- చిన్నారుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు
- గర్భిణులు, శిశువులకు ఉచితంగా టీకాలు
- వైద్యసిబ్బందికి పక్కాగా లక్ష్యాలు
- పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తున్న ప్రభుత్వం



బేతపూడిలో వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డీఐఓ వెంకటేశ్వర్లు

బాపట్ల అర్బన్: పసిబిడ్డల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా ప్రభుత్వం అడుగులేస్తుంది. చిన్నారుల్లో రోగ నిరోధక శక్తిని పెంచేందుకు కార్యచరణ అమలు చేస్తుంది అందులో భాగంగా జిల్లాలో పగడ్బందీగా మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అప్పుడే జన్మించిన శిశువు నుంచి 10 ఏళ్ల పిల్లల వరకు ఉచితంగా టీకాలు వేయిస్తుంది. ఈ క్రమంలోనే గర్భిణులకు సైతం వ్యాక్సిన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 100% వ్యాక్సినేషన్ లక్ష్యంగా వైద్య సిబ్బందికి దిశా నిర్దేశం చేసింది. ప్రాణాంతక వ్యాధుల నుంచి పసివాళ్లకు రక్షణ కల్పించేందుకు చిత్తశుద్ధితో శ్రమిస్తుంది.

జిల్లా సమాచారం	
ఏరియా ఆస్పత్రులు	: 2
పీహెచ్‌సీలు	: 43
కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు	: 8
పట్టణ ఆరోగ్య కేంద్రాలు	: 12
జీరో వయసు శిశువులు	: 27,032
రెండేళ్ల పిల్లలు	: 54,064
2–5 ఏళ్ల లోపు పిల్లలు	: 78,084

వందశాతం పూర్తిచేసేలా దిశా నిర్దేశం..

జిల్లాలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు జిల్లా ఆసుపత్రి ఏరియా హాస్పిటల్‌లో ప్రతిరోజు ఉచితంగానే టీకాలు వేయిస్తున్నారు. అలాగే ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి బుధవారం, శనివారం వ్యాక్సినేషన్ డే చేపడుతున్నారు. ఈ క్రమంలోనే, ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు వారి పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి గర్భిణులు, చిన్నారులకు టీకాలు వేస్తున్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారులు సైతం ఎప్పటికప్పుడు అవసరాలకు తగ్గట్టు వ్యాక్సిన్‌లను ఆరోగ్య కేంద్రాలకు చేరుస్తున్నారు. వీటిని నిల్వ చేసుకునేందుకు వీలుగా రిఫ్రిజిరేటర్లను సైతం ఆరోగ్య కేంద్రాల్లో సమకూర్చారు. అప్పుడే పుట్టిన బిడ్డనుంచి పదేళ్ల పిల్లల వరకు 100% వ్యాక్సినేషన్ లక్ష్యంగా పనిచేస్తున్నారు.

వందశాతమే లక్ష్యం

జిల్లాలో వ్యాక్సినేషన్ నూరుశాతం పూర్తి చేయాలని వైద్య ఆరోగ్య శాఖ సంకల్పించింది ఇందుకోసం ప్రత్యేకంగా మిషన్ ఇంద్రధనస్సును చేపట్టింది. ఆగస్టు 7 నుంచి అక్టోబర్ 14 వరకు మూడు విడతల్లో వ్యాక్సినేషన్ కు రంగం సిద్ధం చేసింది. అందులో భాగంగా జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. మొత్తం 477 సచివాలయ పరిధిలో 5,43,030 కుటుంబాలను సందర్శించగా 2150 మంది టీకాకు దూరంగా ఉన్నట్లు గుర్తించారు. వీరికి మొదట విడత ఆగస్టు 7 నుంచి 12వ తేదీ వరకు రెండో విడతలో సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు మూడో విడతలో అక్టోబర్ 9 నుంచి 14 వరకు టీకాలు ఇవ్వనున్నారు.

నిర్లక్ష్యం వద్దు

పిల్లల సంరక్షణ విషయంలో తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలి. బిడ్డకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి. ఇందులో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించకూడదు. ఏ టీకా దీనికి ఇచ్చారు, మళ్లీ ఎప్పుడు రావాలి వేసిన టీకాను కార్డులో నమోదు చేశారా? తదితర విషయాలను జాగ్రత్తగా పరిశీలించుకోవాలి. కార్డును భద్రపరచుకోవడం నెలసరి బరువు చెక్ చేసుకోవడంతో పాటు వైద్యులు సలహాలు విధిగా పాటించాలి.

– డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, డీఐఓ, బాపట్ల జిల్లా

చదువు మానేసిన వారికి సువర్ణ అవకాశం

ఏపీ ఓపెన్ స్కూల్‌పై శిక్షణ కార్యక్రమం

బాపట్ల అర్బన్: వివిధ కారణాలతో చదువు మధ్యలో ఆపేసిన వారు ఏపీ ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లను మళ్లీ చదువుకునే అవకాశం ఉందని విద్యా శాఖాధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ అడ్మిషన్స్‌లో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు ఆదేశాల మేరకు బుధవారం ఏబీఎం హైస్కూల్లో ఏ1 కో-ఆర్డినేటర్‌లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అపోస్ జిల్లా కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా చదువు మధ్యలో ఆపేసిన వారికి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంఈఓలు నిరంజన్, ప్రసాద్ పాల్గొన్నారు. తొలుత కో-ఆర్డినేటర్స్ ర్యాలీ నిర్వహించారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే కోన



లబ్ధిదారులకు కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎమ్మెల్సీ పోతుల సునీత, జేసీ శ్రీధర్

బాపట్ల: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని శాసన సభ్యుడు కోన రఘుపతి కోరారు. కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ పోతుల సునీత, జేసీ శ్రీధర్ హాజరై కిట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కోన మాట్లాడుతూ రాష్ట్రంలో శిశు మరణాలు తగ్గించడానికి తల్లులు ఆరోగ్య కరమైన బిడ్డను ప్రసవించడానికి పథకాన్ని అమలు చేస్తున్నారని వివరించారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నట్లు చెప్పారు. పేద, మధ్య తరగతి మహిళలు ఆరోగ్యంగా ఉండాలని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ శివ జ్యోతి, ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ, పౌర సరఫరాల శాఖ డి.ఎస్.ఒ. విల్లేమ్స్, డి.ఎం. శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె రూరల్: సంపూర్ణ ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకాలకు శ్రీకారం చుట్టారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని తన వ్యక్తిగత కార్యాలయంలో బుధవారం కిట్లను అందజేశారు. ఎంపీ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల ఆరోగ్య రక్షణకు అవసరమైన పౌష్టికాహారాన్ని అందించాలన్న లక్ష్యంతో ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి, తహసీల్దార్ మల్లికార్జునరావు, కమిషనర్ విజయసారథి, జెడ్పీటీసీ సభ్యులు మాన్యం నాగలక్ష్మి, బొర్రా లక్ష్మీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పౌష్టికాహారం కిట్లు అందజేస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

తండ్రీకొడుకులకు గాయాలు



షేక్ మౌలాలి



షేక్ మస్తాన్‌వలి

నాదెండ్ల: జాతీయ రహదారి మలుపు వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో తండ్రీకొడుకులు గాయాలపాలైన ఘటన బుధవారం గణపవరం వద్ద చోటు చేసుకుంది. నేషనల్ హైవే పెట్రోలింగ్ పోలీసులు తెలిపిన వివరాలు.. గణపవరానికి చెందిన షేక్ మస్తాన్‌వలి, చిలకలూరిపేటలోని మద్దినగర్‌లో నివాసం ఉంటూ మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. వృద్ధాప్య పెన్షన్ కోసం తన తండ్రి షేక్ మౌలాలిని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని గణపవరం వెళ్లి తిరిగి చిలకలూరిపేట వస్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారిని దాటి వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న తండ్రీకొడుకులు గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను చిలకలూరిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మస్తాన్‌వలి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పులుల సంచారంపై పుకార్లు!

మాచర్ల: పట్టణ శివారు ప్రాంతంలోని 9వ వార్డు లోని ఎరుకల కాలనీ చివరి ప్రాంతంలో రెండు పులులు సంచరిస్తున్నట్లు ఆ ప్రాంత వాసులు ఆందోళనకు గురవుతున్నారు. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో శివారు ప్రాంతంలో నివాసముంటున్న మహిళ డి.రాజేశ్వరి బయట కూర్చున్న సమయంలో రెండు జంతువులు వేగంగా దూకుతూ సంచరించటంతో భయపడిన ఆ మహిళ వెంటనే ఇంటిలోకి వెళ్లి తలుపులు వేసుకొని బంధువులకు సమాచారం ఇచ్చారు. ఆ తరువాత 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అ టవీ శాఖ అధికారులు జంతువుల అడుగు జాడలను పరిశీలించారు. ఇవి అడవి కుక్కలని, భయపడాల్సిన అవసరం లేదని తేల్చారు. దీంతో శివారులో నివాసముంటున్న ఇద్దరు మహిళలు బుధవారం ఇళ్లు ఖాళీ చేశారు.

అట్రాసిటీ కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇవ్వటం నిలిపివేయాలి

నరసరావుపేట: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలో నిందితులకు స్టేషన్ బెయిల్ ఇవ్వటాన్ని వెంటనే నిలిపివేయాలని దళిత ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా దళితుల మీద దాడులు పెరుగుతున్న నేపథ్యంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్), వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర దళిత రక్షణ యాత్రలో ప్రభుత్వం ముందు ఉంచాల్సిన డిమాండ్లపై బుధవారం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో దళిత ప్రజాసంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా అధ్యక్షులు చింతపల్లి నాగమల్లేశ్వరరావు, కారుచోల రోశయ్య, ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ప్రసాద్, జై భీమ్ భారత్ పార్టీ జిల్లా సమన్వయకర్త గోదా జాన్‌పాల్, డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిగం చిట్టిబాబు, మాల మహానాడు జిల్లా నాయకులు కూచిపూడి చంద్రశేఖర్, ఎంఐఎం నాయకులు కరిముల్లా, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి తాళ్లూరు పెద్దిరాజు పాల్గొన్నారు.

ఆర్మీ ర్యాలీ అభ్యర్థుల వసతి ఏర్పాట్లు పరిశీలన

నరసరావుపేట ఈస్ట్: ఆర్మీ ఎంపికల ర్యాలీ ఏర్పాట్లను జిల్లా జాయింట్ శ్యామ్‌ప్రసాద్ బుధవారం పరిశీలించారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేట డీఎస్‌ఏ స్టేడియంలో 20 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ర్యాలీకి హాజరయ్యే అభ్యర్థులు ఉండేందుకు అనువైన ప్రాంతాలను ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి, కలెక్టరేట్ ఏఓ అనిల్‌కుమార్‌లతో కలసి పరిశీలించారు. దీనిలో భాగంగా శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల బాలుర వసతి గృహాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆర్మీ ర్యాలీకి వేల సంఖ్యలో హాజరయ్యే అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కారు ఢీకొని ఒకరు దుర్మరణం

మరో ఇద్దరికి గాయాలు

మేదరమెట్ల: మోటారు బైకును కారు ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడిన ఘటన పి.గుడిపాడు జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. జె.పంగులూరు మండలంలోని బూదవాడ గ్రామానికి చెందిన మొద్దుమాల పవన్‌కుమార్(22), గోగులమూడి కిషోర్, ఇస్తర్ల తేజ కొరిశపాడులో శుభకార్యక్రమానికి హాజరై మోటారు బైకుపై తిరిగి వెళ్తున్నారు. ఇదే సమయంలో బైకు పి.గుడిపాడు జాతీయరహదారి గాజు ఫ్యాక్టరీ సమీపానికి రాగానే వెనుక నుంచి వచ్చిన కారు, మోటారు బైకును బలంగా ఢీ కొంది. ఈప్రమాదంలో బైకుపై ఉన్న ముగ్గురు రోడ్డుపై పడిపోయారు. దీంతో పవన్(22) అక్కడికక్కడే మృతి చెందాడు. తేజ, కిషోర్‌లకు గాయాలు కాగా హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మోటారు బైకును ఢీ కొట్టిన కారు ఆగకుండా అక్కడనుంచి వెళ్లిపోయిందని స్థానికులు చెబుతున్నారు. మేదరమెట్ల ఎస్ఐ నాగశివారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అయితే ప్రమాదానికి కారణమైన కారును ముప్పవరం సమీపంలో వదిలి వెళ్లగా పోలీసులు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



ప్రమాదంలో మృతి చెందిన పవన్ కుమార్

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

- 94 కిలోలు, రెండు కార్లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం
- ఒడిశా నుంచి కేరళకు తరలిస్తున్నట్లు గుర్తింపు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జె.రాంబాబు, పక్కన స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

పెదకాకాని: గంజాయి తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు మంగళగిరి డీఎస్పీ జె.రాంబాబు తెలిపారు. స్థానిక స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కేరళ రాష్ట్రానికి చెందిన శైజు మచ్చింగల్ వర్గీస్, మండకర సడకతుల్లాలు స్నేహితులు. చెడు అలవాట్లకు బానిసలుగా మారి, సులువుగా డబ్బులు సంపాదించాలని దురుద్దేశంతో ఒడిశా వెళ్లి అక్కడ నుంచి 94 కేజీల గంజాయిని తీసుకుని కారులో వెళ్తున్నారు. సోమవారం గుంటూరు ఆటోనగర్ సమీపంలోకి చేరుకునే సరికి మరమ్మతులకు గురైంది. కారును రిపేరు చేయించేందుకు ఆటోనగర్ ఫేస్- 4 లోని బొల్లం వెంకటేశ్వరరావుకు చెందిన రామచంద్ర కారు షెడ్డులో పెట్టారు. కారులో ఉన్న గంజాయిని మరో కారులో తరలించేందుకు మంగళవారం కారుతో అక్కడికి చేరుకున్నారు. అప్పటికే ముందస్తు సమాచారం మేరకు అప్రమత్తమైన పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు సిబ్బంది రాబడిన సమాచారం మేరకు కారును అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా సుమారు 94 కేజీల గంజాయి గుర్తించారు. నిందితులు కేరళ రాష్ట్రానికి చెందిన శైజు మచ్చింగల్ వర్గీస్, మండకర సడకతుల్లాలను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుండి గంజాయి తో పాటు ఆడి కారు, స్విఫ్ట్ డిజైర్ కారు, 4 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందని డీఎస్పీ వివరించారు. నిందితులు ఇద్దరూ కూడా గతంలో వేర్వేరు గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ఈ కేసును ఛేదించిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ప్రత్యేకంగా అభినందించినట్లు చెప్పారు. పెదకాకాని తహసీల్దార్ పి.రత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో సీఐ బండారు సురేష్ బాబు, ఎస్ఐ వి.రాంబాబు ఉన్నారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఘటన స్థలంలో వ్యక్తి మృతదేహం

కారంచేడు: ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొని మరో వాహనంపై వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. వాడరేవు- పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో కారంచేడు- చీరాల మార్గంలో ఉన్న రెండు వంతెనల మధ్యలో ఈ ప్రమాదం బుధవారం రాత్రి చోటుచేసుకుంది. మృతి చెందిన యువకుడు చీరాల వైపు నుంచి కారంచేడు వైపునకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. వాహనం వెనుక నుంచి ఢీకొట్టిందా లేక ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టిందా అనే విషయం తెలియాల్సి ఉంది. మృతి చెందిన యువకుని వయసు 30-35 సంవత్సరాల మధ్య ఉంటుంది.